సాక్షి
కామారెడ్డి
శనివారం ¦ 27 ¦ జూలై ¦ 2024



అండగా ఉంటా..

తనను ఆదరించి గెలిపించిన ప్రజలకు ఎల్ల వేళలా అండగా ఉంటానని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు.

- 11లో ▸



సమస్యలు పరిష్కరించాలి

మధ్యాహ్న భోజన ఏజెన్సీల సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కార్మికులు డీఈవోను కోరారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
29.5 /22.2

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. పలు ప్రాంతాలలో ఓ మోస్తరునుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

అప్రమత్తతే ఆయుధం!

పాల్వంచ మండలం భవానీపేటలో మరో కొత్త రకం సైబర్ మోసం వెలుగు చూసింది. వారం క్రితం ఓ సైబర్ నేరగాడు వెంకట్‌రెడ్డి అనే వ్యక్తికి ఫోన్ చేశాడు. అమెరికాలో ఉన్న ఆయన కూతురు గదిలో నివసిస్తున్న మరో అమ్మాయి మృతి చెందిందని, మీ కూతురు పోలీసుల అదుపులో ఉందని నమ్మించాడు. పోలీసులను సముదాయించి ఆమెను విడిపించడానికి వెంటనే డబ్బులు పంపాలని మాయమాటలు చెప్పి రూ.లక్ష కాజేశాడు. కొద్ది సేపటికే వెంకట్‌రెడ్డికి కూతురు ఫోన్ చేసింది. సంఘటన గురించి వాకబు చేయగా అలాంటిదేమీ జరగలేదనీ, తాను క్షేమంగా ఉన్నానని చెప్పింది.

కామారెడ్డికి చెందిన ఓ బీమా కంపెనీ ఏజెంట్ చంద్రశేఖర్‌కు ఇటీవల వాట్సాప్‌లో యాక్సిస్ బ్యాంకు ఏపీకే ఫైల్ వచ్చింది. తన ఖాతా కూడా యాక్సిస్ బ్యాంకుదే కావడంతో అతడు యాక్టివేట్ చేశాడు. వెంటనే అతడి ఫోన్ హ్యాక్ అయింది. ఖాతాలో అంతగా డబ్బులు లేకపోవడంతో చంద్రశేఖర్ పేరు మీద రూ.2.71 లక్షలు లోన్ తీసుకుని మరీ డబ్బులు కాజేశారు.

కామారెడ్డిలోని వీక్లీ మార్కెట్‌కు చెందిన రవీందర్‌కు వాట్సాప్‌లో యూనియన్ బ్యాంక్ పేరుమీద ఏపీకే ఫైల్ వచ్చింది. దానిని ఇన్‌స్టాల్ చేయగానే ఆయన బ్యాంక్ ఖాతాల్లోని రూ.1.90 లక్షలు దోచుకున్నారు.



- రెచ్చిపోతున్న సైబర్ దొంగలు
- కొత్తకొత్త రూపాల్లో మోసాలు
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: సైబర్ దొంగలు రెచ్చిపోతున్నారు. రోజుకో రూపంలో మోసాలకు తెర లేపుతున్నారు. ప్రజలకు ఆశ చూపి ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. ఉద్యోగాల పేరిట బురిడీ కొట్టిస్తున్నారు. దీంతో సైబర్ నేరాలను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. అప్రమత్తంగా ఉంటేనే వీటి నుంచి తప్పించుకోవచ్చని భావించి, దీనిపై విస్తృతంగా అవగాహన కల్పించాలని పోలీసులకు సూచించింది. దీంతో పోలీసులు సైబర్ నేరాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు.

పెరుగుతున్న నేరాలు

కామారెడ్డి జిల్లాలో సైబర్ నేరాల సంఖ్య ఇటీవల బాగా పెరిగింది. 2022లో 428 ఫిర్యాదులు రాగా 267 కేసు నమోదయ్యాయి. ఆయా కేసుల్లో సైబర్ నేరగాళ్లు అమాయకుల ఖాతాల నుంచి రూ.1.57 కోట్లు కొల్లగొట్టారు. 2023లో 546 ఫిర్యాదులు నమోదయ్యాయి. వాటిలో 238 కేసులు నమోదు కాగా బాధితులు కోల్పోయిన మొత్తం రూ.2.71 కోట్లుగా నమోదైంది. 2024లో జూన్ వరకు 425 ఫిర్యాదులు రాగా 86 కేసులు నమోదయ్యాయి. ఆయా కేసుల్లో బాధితుల ఖాతాల నుంచి రూ.2.12 కోట్ల వరకు సైబర్ దొంగలు మాయం చేశారు.



దోమకొండలోని బ్యాంకులో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు

జిల్లాలో మూడు సబ్‌డివిజన్‌లు 23 పోలీస్ స్టేషన్‌లు ఉన్నాయి. ఆయా సబ్ డివిజన్ పరిధిలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లోనూ స్థానిక పోలీసులు, పోలీసు కళా బృందం వారితో కలిసి సైబర్ నేరాలపై అవగాహనా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. గతంలోనూ సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టేవారు. కానీ ప్రస్తుతం విస్తృతం చేశారు. గత 15 రోజులుగా పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌లు, జన సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలు, ప్రధాన కూడళ్లలో స్థానికులతో కలిసి సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎస్సై, ఏఎస్సై స్థాయి అధికారులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొంటూ ఇతర నేరాలతో పాటు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఆన్‌లైన్ మోసానికి గురైతే వెంటనే డయల్ 100కు గానీ, టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి గానీ ఫోన్ చేసి ఫిర్యాదు ఎలా చేయాలో వివరిస్తున్నారు.

కొత్తదారులు



సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేయడానికి కొత్తదారులు వెతుక్కుంటున్నారు. గతంలో బ్యాంకు అధికారులం అంటూ ఫోన్ చేసి ఖాతా నెంబర్, పాస్వర్డ్‌లు, ఓటీపీలు తెలుసుకుని డబ్బులు కాజేసే వారు. కొద్ది రోజుల తర్వాత బంపర్ ఆఫర్‌లు, అత్యధిక వేతనంలో కూడిన ఉద్యోగాలు, విదేశాల్లో ఉద్యోగాలు, బహుమతులు గెలుచుకున్నారంటూ గాలం వేయడం లాంటివి చేశారు. తాజాగా వాట్సాప్ యాప్‌లోకి కూడా దిగారు. ఏపీకే ఫైళ్లు పంపుతున్నారు. వాటిని డౌన్‌లోడ్ చేసుకోగానే ఫోన్ హ్యాకయి సైబర్ దొంగల చేతికి వెళ్తోంది. దీంతో వారు ఖాతాను ఖాళీ చేస్తున్నారు. అకౌంట్‌లో డబ్బులు లేకపోతే లోన్లు తీసుకొని మరి దోచుకుంటున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్తదారుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. సైబర్ నేరాలకు గురయితే వెంటనే డయల్ 100కు గానీ, 1930 కి గానీ ఫిర్యాదు చేయాలి. లింక్‌లు, ఏపీకే ఫైళ్లు ఓపెన్ చేయొద్దు. సైబర్ నేరాల నియంత్రణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులు, ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం.

– చంద్రశేఖర్ రెడ్డి, ఎస్‌హెచ్‌వో, కామారెడ్డి

న్యూస్‌రీల్

‘డబుల్’ ఇళ్లలో సమస్యలు పరిష్కరిస్తాం



కామారెడ్డి క్రైం: డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీలో గల డబుల్ బెడ్ రూమ్ కాలనీని ఆయన మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియతో కలిసి పరిశీలించారు. డబుల్ బెడ్ రూమ్ కాలనీలో నెలకొన్న సమస్యలు, ఇంకా చేపట్టాల్సిన పనుల గురించి తెలుసుకున్నారు. పట్టణంలో వార్డుల వారీగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న మాస్ క్లీనింగ్ గురించి కలెక్టర్‌కు చైర్‌పర్సన్ వివరించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, ఆర్డీవో రంగనాథ్, తహసీల్దార్ జనార్దన్, వార్డ్ కౌన్సిలర్ జహీరా బేగం యామిన్, తేజపు మానస ప్రసాద్, పాత శివ కృష్ణమూర్తి, చాట్ల వంశీ, రవి గౌడ్, ఇల్లందుల లతా వేణు పాల్గొన్నారు.

సివిల్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి రజిత ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్స్ ప్రిలిమ్స్ కమ్ మెన్స్–2025 పోటీ పరీక్షలకు ఈనెల 31లోగా తెలంగాణ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసిన వారికి ఆగస్టు 11న ఎంపిక పరీక్ష ఉంటుందన్నారు.

నిజాంసాగర్‌లోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు శుక్రవారం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 650 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా.. శుక్రవారం సాయంత్రానికి 1,388.60 అడుగుల(3.519 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

‘పోచారం’లోకి పెరిగిన వరద

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో పెరిగింది. గురువారం 61 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. శుక్రవారం 431 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టులో 9 అడుగుల(0.423టీఎంసీ) నీరు నిల్వ ఉందని ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



కామారెడ్డి రూరల్ : మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్‌డీవో చందర్‌నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం కామారెడ్డి మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా క్యాంటిన్, ఈవెంట్ ప్రోగ్రామ్స్, పాడి పశువులు, పెరటి కోళ్ల పెంపకంపై వివరించారు. కామారెడ్డి మండల సమాఖ్య గ్రామ సంఘాలకు మోడల్‌గా ఉండాలని ఆదేశించారు. డీపీఎంలు సుధాకర్, రవీందర్, వకుల, సీసీలు విశ్వనాథం, స్వరూప, సంజీవులు పాల్గొన్నారు.

ఊరపండుగ విగ్రహాల తయారీ పరిశీలన



నిజామాబాద్‌అర్బన్: నగరంలో ఈనెల 28న నిర్వహించే ఉర పండుగ సందర్భంగా విగ్రహాల తయారీని శుక్రవారం నిజామాబాద్ సర్వసమాజ్ కమిటీ సభ్యులు పరిశీలించారు. నకాశ్ గల్లీలో వడ్ల దాతి వద్ద సార్గమ్మలు, కొండల్ రాయుడు, భోగంసాని, మహాలక్ష్మమ్మ, మత్తడి పోచమ్మ, అంపుడు పోచమ్మ, ఐదు చేతుల పోచమ్మ, పొడాలమ్మ, పెద్దమ్మ, అడేల్లి పోచమ్మ, రాట్నం, జెండా తదితర విగ్రహాల తయారీని పరిశీలించారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న బీజేవైఎం నాయకులు

కామారెడ్డి రూరల్: కార్గిల్ విజయ్ దివస్‌ను శుక్రవారం కామారెడ్డిలో ఘనంగా నిర్వహించారు. బీజేవైఎం ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ.. కార్గిల్ యుద్ధంలో విజయం సాధించి 25 ఏళ్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మల్కా యశస్వి, జిల్లా అధ్యక్షుడు నంది వేణు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో చిన్నారులకు గుండె వైద్యశిబిరం



జీజీహెచ్‌లో చిన్నారులకు గుండె పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో శుక్రవారం రాష్ట్రీయ బాల స్వస్థ, జిల్లా వైద్యారోగ్యశాఖ, అపోలో ఆస్పత్రి హైదరాబాద్ ఆధ్వర్యంలో పిల్లలకు ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించారు. 18 ఏళ్లలోపు పిల్లలకు గుండె పరీక్షలు చేశారు. ఇందులో సుమారు 156 మంది పిల్లలకు 2డీ ఎకో పరీక్షలు చేయగా.. 53 మందికి ఆపరేషన్లు చేయాల్సిన అవసరమని, 21 మందికి ఇతర పరీక్షలు, 26 మందికి ఫాలోఅప్ అవసరమని గుర్తించారు. శిబిరంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో తుకారం రాథోడ్, సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, డీఐవో డాక్టర్ అశోక్, నోడల్ ఆఫీసర్ స్రామాట్, మేనేజర్ సచిన, ఆర్‌బీఎస్‌కే అరవింద్, ఫణింద్ర, వెంకటేశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చదనంపై గొడ్డలి వేటుకు సిద్ధం!

- మెదక్ నుంచి రుద్రూర్ వరకు జాతీయ రహదారి నిర్మాణం
- జిల్లాలో 7,805 చెట్లను తొలగించనున్న అధికారులు



రోడ్డు విస్తరణ పనుల్లో తొలగించే చెట్లను గుర్తిస్తున్న ఫారెస్ట్ అధికారులు(ఫైల్)



ఎన్‌హెచ్–765డి విస్తరణలో మాయమవనున్న చెట్లు

నాగిరెడ్డిపేట: దశాబ్దాలుగా నీడనిస్తూ, ఆహ్లాదాన్ని పంచుతున్న ఆ వృక్షాలు త్వరలో మాయమవబోతున్నాయి. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా వేలాది చెట్లు గొడ్డలి వేటుకు బలి కాబోతున్నాయి. ఎన్‌హెచ్–765 డి జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా మెదక్ – బోధన్ రోడ్డును అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2022లో రూ.899 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ ఏడాది మార్చిలో పటాన్‌చెరులో నిర్వహించిన సభలో ప్రధాని నరేంద్రమోదీ పాల్గొని పనులను వర్చువల్‌గా ప్రారంభించారు. మెదక్ నుంచి ఎల్లారెడ్డి వరకు ఒక ప్యాకేజీ, ఎల్లారెడ్డి నుంచి వర్ని మీదుగా రుద్రూర్ వరకు మరో ప్యాకేజీగా పనులు చేపట్టాల్సి ఉంది.

తొలగించాల్సిన చెట్ల గుర్తింపు

రోడ్డు విస్తరణతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలను తొలగించాల్సి ఉంటుంది. ఇలా తొలగించాల్సిన చెట్లను గుర్తించడానికి ఫారెస్ట్ అధికారులు ఫిబ్రవరిలో సర్వే చేపట్టారు. రోడ్డు విస్తరణ కోసం నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం నుంచి ఎల్లారెడ్డి వరకు 2,557 చెట్లను, ఎల్లారెడ్డి నుంచి నస్రుల్లాబాద్ మండలం వరకు 5,248 వృక్షాలు తొలగించాలని గుర్తించారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు..

రోడ్డు విస్తరణలో తొలగించే చెట్లకు బదులు కొత్తగా మొక్కలు పెంచేందుకు అటవీశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం అటవీశాఖకు కేటాయించే స్థలంలో తొలగించే చెట్లకు రెట్టింపు సంఖ్యలో మొక్కలు నాటాలని నిర్ణయించారు. తొలగించే చెట్ల గుర్తింపు ప్రక్రియ పూర్తయ్యిందని నాగిరెడ్డిపేట ఎఫ్‌ఆర్‌వో వాసుదేవ్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, బాన్సువాడ రేంజ్‌ల పరిధిలో తొలగించే చెట్లకు బదులుగా అటవీ శాఖకు కేటాయించే స్థలంలో కొత్తగా మొక్కలను నాటుతామని పేర్కొన్నారు.

సన్నాలకు బోనస్

- 33 రకాలను గుర్తించిన ప్రభుత్వం
- బడ్జెట్‌లో ప్రత్యేకంగా ప్రస్తావన
- ఆయా వెరైటీలు సాగు చేస్తున్న వారికి లబ్ధి



కామారెడ్డి క్రైం: వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిన కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లోనే భారీగా నిధులు కేటాయించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేసే దిశగా సన్నరకం వడ్లు పండించిన రైతులకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటికే కామారెడ్డి జిల్లాలో వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. 33 రకాల సన్నాల వెరైటీలను గుర్తించిన ప్రభుత్వం ఆయా వెరైటీలను సాగు చేస్తున్న రైతులకు బోనస్ ఇస్తామని ప్రకటించింది. జిల్లా వ్యాప్తంగా వానాకాలం సీజన్‌లో 3.14 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తారని అంచనా. గతంలో ఎక్కువగా దొడ్డు రకం వరినే సాగుచేసేవారు. ప్రభుత్వం సన్నాలకు బోనస్ ప్రకటించడంతో సన్నరకం వరి సాగు పెరిగే అవకాశం ఉంది.

అనేక సందేహాలు

ప్రభుత్వం 33 రకాలను సాగు చేసిన వారికే రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించడం చాలా మంది రైతులను అయోమయానికి గురిచేస్తుంది. మార్కెట్లో దాదాపు 300 రకాల సన్నాలు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధమైన రకాలను సాగు చేస్తుంటారు. అంతేగాకుండా జూన్‌లోనే రైతులు విత్తనాలు కొని, తుకాలు పోశారు. ప్రభుత్వం తాజాగా 33 రకాల వివరాలను ప్రకటించింది. దీంతో ఇప్పటికే నాట్లు వేసుకున్న రైతులు ఒక వేళ తాము సాగు చేసే రకం 33 రకాల్లో లేనిది అయితే బోనస్ అందదని ఆందోళన చెందుతున్నారు. జూన్ ప్రారంభంలోనే బోనస్ ఇచ్చే రకాలను ప్రకటిస్తే బాగుండేదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఎంపిక చేసిన సన్న రకాలు

సిద్ధి (డబ్ల్యూజీఎల్–44)		
కంపాసాగర్ వరి–1 (కేపీఎస్ 2874)		ప్రత్యుమ్న (జేజీఎల్ 17004)
సాంబమసూరి (బీపీటీ 5204)	వరంగల్ వరి–1119	సుగంధ సాంబ (ఆర్‌ఎన్‌ఆర్ 2465)
జగిత్యాల వరి–3 (జేజీఎల్ 27356)	కూనారం వరి–2 (కేఎన్‌ఎం 1638)	శోభిని (ఆర్‌ఎన్‌ఆర్ 2354)
జగిత్యాల వరి–2 (జేజీఎల్ 28545)	వరంగల్ వరి–2 (డబ్ల్యూజీఎల్ 962)	సోమనాథ్ (డబ్ల్యూజీఎల్ 347)
వరంగల్ సాంబ (డబ్ల్యూజీఎల్–14)	రాజేంద్రనగర్ వరి–4 (ఆర్‌ఎన్‌ఆర్ 21278)	ఆర్‌ఎన్‌ఆర్ 31479 (పీఆర్సీ)
వరంగల్ సన్నాలు (డబ్ల్యూజీఎల్ 32100)	కూనారం వరి–1 (కేఎన్‌ఎం 733)	కేపీఎస్ 6251 (పీఆర్సీ)
జగిత్యాల మసూరి (జేజీఎల్ 11470)	జగిత్యాల సన్నాలు (జేజీఎల్ 1798)	జేజీఎల్ 33124 (పీఆర్సీ)
పొలాస ప్రభ (జేజీఎల్ 384)	జగిత్యాల సాంబ (జేజీఎల్ 3844)	హెచ్‌ఎంటీ సోన
కృష్ణ (ఆర్‌ఎన్‌ఆర్ 2458)	కరీంనగర్ సాంబ (జేజీఎల్ 3855)	మారుటేరు సాంబ (ఎంటీయూ 1224)
మానేరు సోన (జేజీఎల్ 3828)	అంజన (జేజీఎల్ 11118)	మారుటేరు మసూరి (ఎంటీయూ 1262)
తెలంగాణ సోన (ఆర్‌ఎన్‌ఆర్ 15048)	నెల్లూరు మసూరి (ఎన్‌ఎల్‌ఆర్ 34449)	ఎంటీయూ 1271

అభివృద్ధి కోసమే పార్టీ మారా

- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాను పార్టీ మారానని, ఎలాంటి స్వార్థం లేదని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాన్సువాడలో ఆగ్రోస్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్ రూం బిల్లులను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సొంత స్థలాల్లో డబుల్ బెడ్ రూం ఇల్లు కట్టుకునే వారికి డబ్బు ఇచ్చే జీవో ఈ రోజుకు లేదన్నారు. అయినా నియోజకవర్గంలో 11 వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించామని, ఇందులో 4 వేల ఇళ్లు కాంట్రాక్టర్లు నిర్మిస్తే, ఏడు వేల ఇళ్లు పేదలు సొంతంగా కట్టుకున్నారని చెప్పారు. డబుల్ బెడ్ రూం ఇళ్లకు సంబంధించి గత ప్రభుత్వంలో 93 శాతం బిల్లులు వచ్చాయని, రూ.20 కోట్లు పెండింగ్‌లో ఉండడంతో సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడితే ప్రస్తుతం రూ.8 కోట్ల బిల్లులు ఇచ్చారని తెలిపారు. పదేళ్లలో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. ఇంకా కొన్ని పనులు మధ్యలో ఉన్నాయని, తాను రిటైర్డ్ అయ్యేలోపు మొదలు పెట్టిన పనులన్నీ పూర్తి చేస్తానని పేర్కొన్నారు. నాయకులు పోచారం సురేందర్ రెడ్డి, జంగం గంగాధర్, ఎజాస్, మధుసూదన్ రెడ్డి, అంజిరెడ్డి, కాసుల రోహిత్, అమేర్, దాసరి శ్రీనివాస్, నార్ల సురేష్, అంబర్‌సింగ్ తదితరులు ఉన్నారు.



బాన్సువాడలో బిల్లులు అందజేస్తున్న ఎమ్మెల్యే పోచారం, కాసుల బాల్‌రాజ్

క్లుప్తంగా

ఉద్యోగులకు బదిలీలు సహజం



భిక్కనూరు : ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు తప్పనిసరిగా ఉన్నప్పటికి వారు ప్రజలకు చేసిన సేవలే సమాజంలో వారికి గుర్తింపుని స్తాయని భిక్కనూరు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు.శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శులకు సన్మానించారు. నూతన కార్యదర్శులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రజిత, ఎంపీవో రాజుకిరణ్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

కవి సమ్మేళనంలో పద్మావతి ప్రతిభ



మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ గ్రామానికి చెందిన కవయిత్రి కందాళ పద్మావతి చిత్ర కవిత్వంతో పాటు వచన కవిత్వంలో రాణిస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు. తాజాగా మహాకవి దాశరథి కష్ణమాచార్యులు శత జ యంతి సందర్భంగా కరీంనగర్ జిల్లా సీతా రాంపూర్ భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో ప్రథమస్థానంలో నిలిచి ప్రశంసలు అందుకున్నట్లు శుక్రవారం ఆమె తెలిపారు.

'మధ్యాహ్న' సమస్యలు పరిష్కరించాలి



డీఈవో రాజుకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కామారెడ్డి రూరల్ : మధ్యాహ్న భోజన కార్మికులు వారి సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రపాణి డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం డీఈవో రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలలుగా ఆందోళన చేస్తుంటే నేటికీ కోడిగుడ్లు, 8,9 తరగతుల బిల్లులు చెల్లించలేదని, ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా రూ. 10వేల వేతనంపై నేటికీ స్పష్టత ఇవ్వడం లేదని, కార్మికులు వంట చేసేటప్పుడు ప్రమాదం జరిగితే కనీస ఇన్సూరెన్స్ సౌకర్యం లేదన్నారు. డిమాండ్ల సాధన కోసం ఈనెల 31వ తేదీన నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని కార్మికులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు సోఫియా సహజహాన్, సంగీత, బాలరాజు, దశరథ్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న బీసీ విద్యార్థి సంఘం నేతలు

బాన్సువాడ : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని శుక్రవారం బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం అధికారిణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం మండల అధ్యక్షులు రాఘవ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు రూ.83 కోట్ల స్కాలర్‌షిప్‌లు బకాయిలు ఉన్నాయని, వెంటనే స్కాలర్ షిప్‌లను విడుదల చేయాలని అన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీసీ విద్యార్థులు రాజు, విష్ణు, సాయి తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్యకు పరిష్కారం



భిక్కనూరు : మండలంలోని బస్వాపూర్‌లో ఎస్సీ కాలనీలో పదేళ్లుగా విద్యుత్ సమస్యతో ఆ కాలనీ వాసులు పడుతున్న అవస్థలకు ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ చొరవ చూపి తన సొంత డబ్బులు రూ. 50 వేలు విరాళంగా ఇవ్వడంతో పరిష్కారం లభించింది. కాలనీలో విద్యుత్‌లో ఓల్టేజీ సమస్యపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. పరిస్థితి తెలుసుకున్న షబ్బీర్ అలీ ఉన్నతాధికారులతో మాట్లాడి రూ. 50వేలు చెల్లించి కొత్త డీటీఆర్‌ను మంజూరు చేయించగా అధికారులు శుక్రవారం ఎస్సీ కాలనీలో అమర్చారు. కాంగ్రెస్ నేతలు జీవన్, బాబు, దయాకర్, అనిల్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పురాతన ఆలయాల సందర్శన

- వేణుగోపాలస్వామి, శివాలయాలను సందర్శించిన చరిత్ర బృందం సభ్యులు



పురాతన విగ్రహాన్ని పరిశీలిస్తున్న బృందం సభ్యుడు శ్రీకాంత్

మాచారెడ్డి : మండలకేంద్రంలో కల్యాణి చాళుక్య కాలంలో నిర్మించిన వేణుగోపాల స్వామి, శివాలయం రెండు పురాతన ఆలయాలున్నట్లు కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్, సభ్యుడు మంచాల శ్రీకాంత్ తెలుసుకుని శుక్రవారం ఆలయాలను సందర్శించి వాటిలోని శిల్పాలను, దేవాలయ నిర్మాణాలను పరిశీలించారు. ఈ ఆలయాలను పూర్తిగా పెద్దపెద్ద బండ రాళ్లతో కల్యాణి చాళుక్యుల కాలంలో 10, 11వ శతాబ్దంలో నిర్మించినట్లు తెలిపారు. రెండు దేవాలయాల మంటపాలు అర్ధమంటపశైలిలో 3 ద్వారాలతో, కక్ష్యాసనాలతో నిర్మించబడ్డాయన్నారు. వేణుగోపాల స్వామి గుడిలో మీసాల వేణుగోపాలస్వామి సర్వాలంకారశోభితుడై, దశావతారతోరణంతో, స్వస్తికాసనంలో నిలబడి, వేణువాదనచేస్తూ కనిపిస్తున్నట్లు వివరించారు. శివసాయుజ్యంకోరి ఆ భక్తుడు శూలారోహణం చేసి, ఆత్మాహుతి చేసుకున్నాడని తెలంగాణ చరిత్ర బందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ ఆలయ పూర్వాపరాలను వివరించారు. ఈ ఆలయం శిథిలావస్థకు చేరుకొని ఉండడంతో ఇక్కడ పెద్దగా ఉత్సవాలు జరగట్లేదన్నారు. ప్రభుత్వం ఈ ఆలయానికి తగిన మరమ్మతులు జరిపి పూర్వవైభవం వచ్చేలా చర్యలు చేపట్టాలని బృందం సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు.

ఇంటింటికీ తాగునీరు



అంతంపల్లిలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

భిక్కనూరు : ఇంటింటికీ తాగునీరును అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని భిక్కనూరు మండల వ్యవసాయాధికారి, అంతంపల్లి ప్రత్యేకాధికారి రాధారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అంతంపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామస్తులు తప్పని సరిగా ఇంటి పన్నులను గ్రామపంచాయతీకి సకాలంలో చెల్లించాలన్నారు.



పిట్లంలో..

పిట్లంలో..

పిట్లం(జుక్కల్) : మండలంలోని జీపీకార్యాలయంలో ఎంపీడీవో, ప్రత్యేకాధికారి కమలాకర్ అధ్యక్షతన శుక్రవారం ఓడీఎఫ్ ప్లస్ సుస్థిరతపై ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ ఓడీఎఫ్ ప్లస్ సుస్థిరత కార్యక్రమంలో భాగంగా పంచాయతీ పరిధిలో ప్రతిఒక్కరూ మరుగుదొడ్డి వినియోగించాలన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న హమాలీలు

కామారెడ్డి రూరల్ : ఏఐటీయూసీ అనుబంధ సంఘం సివిల్ సప్లై హమీల సమస్యలు పరిష్కరించాలని సివిల్ సప్లై అధికారి భిక్షపతికి కార్మికులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పి బాలరాజ్ మాట్లాడుతూ ఎగుమతి దిగుమతి రేట్లు గత ప్రభుత్వం హామీ ఇచ్చి మూడేళ్లవుతున్నా పెంచలేదన్నారు. జిల్లాలో ఏడు ఎంఎల్ఎస్ పాయింట్ గోదాంలకు స్వంత భవనాలను నిర్మించాలని, కార్మికులకు కనీస వసతులు కల్పించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ప్రమాద బీమా కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించాలన్నారు. ఈనెల 31వ తేదీన ఇందిరా పార్క్ వద్ద భారీ సభ ఉందన్నారు. 31న హైదరాబాద్ వెళ్లేందుకు అనుమతివ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బాలరాజ్ సివిల్ సప్లై హమాలి సంఘం జిల్లా నాయకులు ఎల్ దశరథ్ తదితరులున్నారు.

ఆస్పత్రిలో సిబ్బందిని నియమించాలి



వైద్యాధికారి విజయలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న తిర్మల్‌గౌడ్ తదితరులు

దోమకొండ : దోమకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సిబ్బంది కొరత ఉందని వెంటనే సిబ్బందిని నియమించాలని మాజీ జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా వైద్యాధికారి విజయలక్ష్మి, మెడికల్ కాలేజీ సూపరిండెంట్ రామ్‌సింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇక్కడి ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న గైనకాలజిస్ట్, డెంటిస్ట్, స్టాఫ్‌నర్స్, ఫార్మాసిస్టు, ఎఎన్ఎంలు లాంగ్ స్టాండింగ్‌లో బదిలీ అయినట్లు వివరించారు. సిబ్బంది లేక పేషంట్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బదిలీ అయిన వైద్యుల స్థానంలో కొత్తవారిని నియమించాలని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సీతారం మధు ఉన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం



బాన్సువాడ : రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించకపోవడంకు నిరసనగా శుక్రవారం బాన్సువాడలో బీజేపీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు కేటాయిచకపోవడం సిగ్గు చేటన్నారు. మేనిఫెస్టోలో పెట్టిన బడ్జెట్‌కు నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శంకర్‌గౌడ్, మక్కన్న, హన్మాండ్లు తదితరులున్నారు.

విద్యారంగాన్ని గాలికొదిలేశారు..



కామారెడ్డి డిగ్రీ కళాశాల ఎదుట బడ్జెట్ పత్రాలను దహనం చేస్తున్న దృశ్యం

కామారెడ్డి రూరల్ : విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులను చదువుకు దూరం చేయడమే అని భారతీయ విద్యార్థి మోర్చ (బీవీఎం) రాష్ట్ర కార్యదర్శి జీవీఎం విఠల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడం సిగ్గుచేటన్నారు. స్కాలర్‌షిప్, ఫీజురియంబర్స్‌మెంట్ నాలుగేళ్లుగా రూ. 8వేల కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. విద్యారంగానికి 30 శాతం నిధులివ్వాలని కోరితే 7.30 శాతం నిధులు కేటాయించడం సరికాదన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని లేనిపక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వాని గుణపాఠం చెబుతామన్నారు. భారతీయ విద్యార్థి మోర్చా జిల్లా నాయకులు యోగేష్, సాయి, తేజ తదితరులున్నారు.

ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా గుంతలు



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని బొమ్మన్‌దేవ్ పల్లి క్రాస్ రోడ్డు వద్ద రోడ్డు ప్రమాదకరంగా మారింది. నిత్యం నీరు పారడంతో రోడ్డుపై గుంతలు ఏర్పడి వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. నీటి నిల్వతో గుంత లోతు తెలియకపోవడంతో ద్విచక్రవాహన దారులు పడిపోయి గాయాలపాలవుతున్నారు. బాన్సువాడ-బోధన్ జాతీయ రహదారి పైనే ప్రమాదకర గుంతలున్నాయన్నారు.

బ్యాంకు రుణాలు రికవరీ చేయాలి



బాన్సువాడ : బ్యాంకుల్లో మహిళ సంఘాల ద్వారా తీసుకున్న రుణాలను వందశాతం రికవరీ అయ్యేలా చూడాలని ఐకేపీ ఏపీఎం గంగాధర్ అన్నారు. శుక్రవారం బీర్కూర్ ఐకేపీ కార్యాలయంలో వీవోలతో మహిళ శక్తి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.

పంచాయతీ నీళ్లు పొలాలకు..



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండలంలోని బేగంపూర్ గ్రామంలోని పలువురు రైతులు జీపీకి సంబంధించిన సింగిల్ ఫేస్‌మోటార్‌తో తమ పంట పొలాలకు నీళ్లు పారించుకుంటున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. జీపీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినప్పటికీ ఆయన పట్టించుకోవట్లేదన్నారు. నిరంతరం సింగిల్‌ఫేస్ మోటార్ పంటపొలాలకు నీళ్లిస్తుండడంతో మోటార్లు చెడిపోతున్నాయని, దీంతో కాలనీల్లో తాగునీటికి ఇబ్బంది వస్తుందన్నారు. సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

కూలిన ఇళ్ల పరిశీలన

లింగంపేట(ఎల్లారెడ్డి): వారం రోజులుగా కురుస్తున్న ముసురుకు మండలంలోని ఎక్కపల్లి గ్రామంలో శుక్రవారం ఇళ్లు కూలినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన దూశన్నగారి బాలయ్యకు చెందిన ఇల్లు కూలిపోయినట్లు తెలిపారు. దీంతో కార్యదర్శి ప్రశాంత్ పరిశీలించారు. తనకు నష్టపరిహారం చెల్లించాలని బాధితుడు కోరాడు. పంచనామా నిర్వహించి పై అధికారులకు పంపుతామన్నారు.

ఎన్‌సీసీకి 53 మంది విద్యార్థుల ఎంపిక



భిక్కనూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు ఎన్‌సీసీలో ఎంపికకు శుక్రవారం పరీక్షలు నిర్వహించి 53 మంది విద్యార్థులను ఎంపికచేశారు. సుబేదార్ రాణా ప్రతాప్, హవాల్దార్ సర్జీత్‌సింగ్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి ఎంపికచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనాథ్, ఎన్‌సీసీ అధికారి వీరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు నిధులివ్వాలి



కామారెడ్డి రూరల్ : తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ నిధుల విడుదలపై రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయొద్దని కామారెడ్డి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మోటూరు శ్రీకాంత్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో మాట్లాడుతూ రాష్ట్ర అర్యవైశ్య కార్పొరేషన్ నిధులు విడుదలపై కాలయాపన చేస్తే రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. రేపు జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో ప్రభావం చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్గనైజింగ్ సెక్రటరీ కూర శ్రీనివాస్, అడ్మినిస్ట్రేషన్ సెక్రెటరీ గరిపల్లి శ్రీధర్ తదితరులున్నారు.

క్రైం కార్నర్

కారు ఢీకొని ఒకరి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు



నరేశ్(ఫైల్)

ఆర్మూర్‌టౌన్: కారు డ్రైవర్ నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ఓ నిండు ప్రాణం గాలిలో కలిసింది. పనులు ముగించుకొని ఇంటికి వెళ్దామనుకునే వారికి ప్రమాదం కారు రూపంలో ముంచుకొచ్చింది. బైక్‌ను ఓ కారు వెనుకనుంచి ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలైన ఘటన ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్ట వెనకాల ఉన్న జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం బాదన్‌కుర్తి గ్రామానికి చెందిన మంత్రరాజ్యం నరేశ్(43), పారిపల్లి నగేశ్ తమ వ్యక్తిగత పనుల నిమిత్తం ఆర్మూర్‌కు బైక్‌పై వచ్చారు. పనులు ముగించుకొని స్వగ్రామానికి వెళ్తుండగా నిజామాబాద్ నుంచి ఆర్మూర్ వైపు వస్తున్న కారు వీరిని వెనుక నుంచి ఢీకొన్నది. ఈ ఘటనలో నరేశ్, నగేశ్‌లకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా నరేశ్ ఆస్పత్రి ఆవరణలోకి చేరుకోగానే మృతి చెందాడు. నగేశ్‌కు మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. నిర్లక్ష్యంగా కారు నడిపిన వ్యక్తిని స్థానికులు చితకబాదారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

శిశుమందిర్‌లో గోరింటాకు మహోత్సవం



బాన్సువాడ : బాన్సువాడ సరస్వతి శిశు మందిర్‌లో శుక్రవారం గోరింటాకు మహోత్సవం నిర్వహించారు. ఆషాఢ మాసం విశిష్టతను తెలుపుతూ గోరింటాకు వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. గోరింటాకు వల్ల క్రిములు నశిస్తాయని, శరీరంలో వేడిని ఉత్పన్నం చేస్తోందని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానాచార్యులు నాగిరెడ్డి, అధ్యాపక బృందం ఉన్నారు.

బీజేపీ యువమోర్చా కార్యవర్గం



భిక్కనూరు : బీజేపీ యువమోర్చా కార్యవర్గసభ్యులుగా భిక్కనూరు మండలంనకు చెందిన ఇద్దరిని శుక్రవారం నియమించారు. ఈమేరకు బీజేపీ యువమోర్చ నంది వేణు అధ్యక్షుడు నంది వేణు పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన గొలిపర్తి రాజేందర్, మోటాట్‌పల్లికి చెందిన భాస్కర్‌రెడ్డికి నియమాకపత్రం అందజేశారు.

విద్యుత్‌షాక్‌తో ఒకరి మృతి

బోధన్‌రూరల్: వెల్డింగ్ పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని పెంటాకుర్దు గ్రామంలో చోటు చేసుకుంది. బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కె జైరాం(36) గురువారం పెంటాకుర్దు క్యాంప్ శివారులో పుర చిన్న గంగారాం అనే వ్యక్తికి చెందిన షెడ్ నిర్మాణ పనులను వెల్డింగ్‌తో చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి మృతి చెందాడు. మృతుడి భార్య పవిత్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇసుక అక్రమ నిల్వలు సీజ్

రెంజల్: మండలంలోని నీలా శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక నిల్వలను మైన్స్ అధికారులు శుక్రవారం సీజ్ చేసి తమకు అప్పగించినట్లు తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. సుమారు 300 ట్రాక్టర్ల సీజ్ చేసిన ఇసుకను రాత్రి వేళ అక్రమార్కులు తరలించకుండా కాపాల ఏర్పాటు చేసినట్లు వివరించారు. తహసీల్ కార్యాలయంలో ఇసుకను శనివారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కుక్కల దాడిలో జింక ..



బోధన్: మంజీర నది తీరంలో ఉన్న సాలూర మండలంలోని తగ్గెల్లిలో శుక్రవారం వీధి కుక్కల దాడిలో కృష్ణ జింక మృతి చెందింది. ఈ విషయాన్ని గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ మేరకు వర్ని ఫారెస్ట్ రేంజ్ సెక్షన్ ఆఫీసర్ చంద్రప్రకాశ్, రుద్రూర్ బీట్ ఆఫీసర్ వందన గ్రామానికి చేరుకొని జింక కళేబరాన్ని పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. జింక కళేబరానికి బోధన్ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేసినట్లు సెక్షన్ ఆఫీసర్ పేర్కొన్నారు.

విద్యుత్తు స్తంభాలను ఢీకొన్న ట్యాంకర్



వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్ సమీపంలో మెట్‌పల్లి వైపు వెళ్తున్న రోలరు ట్యాంకర్ గురువారం తెల్లవారుజామున అదుపు తప్పి విద్యుత్ స్తంభాలను ఢీకొన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆర్మూర్ నుంచి మెట్‌పల్లి వైపు వెళ్తున్న ట్యాంకర్ వర్షంతో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలను ఢీకొన్నట్లు పేర్కొన్నారు. దీంతో స్తంభాలు విరిగి కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడినట్లు గ్రామస్తులు తెలిపారు.

మట్కా స్థావరంపై దాడి

ఖలీల్ వాడి: నగరంలో ఒకటవ టౌన్ పీఎస్ పరిధిలో మట్కా స్థావరాలపై టాస్క్ ఫోర్స్ ఏసీపీ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం దాడి చేశారు. పక్కా సమాచారం మేరకు మట్కా ఆడుతున్న అబ్దుల్ అజీజ్, అబ్దుల్ సుశీత్‌లను అదుపులోకి తీసుకొన్నట్లు తెలిపారు. వారినుంచి రూ.6290 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో రూ.55 లక్షలు పట్టివేత



పట్టుబడిన నగదుతో ఆర్‌పీఎఫ్ సీఐ సుబ్బారావు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో గురువారం రాత్రి ఆర్‌పీఎఫ్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. తనిఖీలో స్టేషన్‌లో ఉన్న ఓ వ్యక్తి బ్యాగులో రూ.55 లక్షల నగదును పట్టుకున్నట్లు ఆర్‌పీఎఫ్ సీఐ సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లోని శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నర్సింగ్‌గల్లీకి చెందిన ప్రకాశ్ రుక్మాయి సింధే బ్యాగులో రూ.55 లక్షలు ఉండడంతో వెంటనే ఒకటో టౌన్ పోలీసులతో పాటు వాణిజ్యశాఖ అధికారులకు సమాచారం అందించి నగదు అప్పగించినట్లు పేర్కొన్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న యువకుడు లక్ష్మణ్

రెంజల్: మద్యానికి బానిసైన ఓ యువకుడు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని నీలా గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లక్ష్మణ్(22) అనే యువకుడు మద్యానికి బానిసయ్యాడు. ఉదయం తన ఇంట్లోని గది నుంచి బయటకు రాకపోవడంతో కుటుంబీకులు గది తెలుపులు తెరిచి చూడగా దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసున మోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బోధన్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.